ఇంటర్ ఫలితాల్లో కార్పొరేట్‌కు దీటుగా..

- అగనంపూడి ప్రభుత్వ కళాశాల రికార్డు
- జిల్లాలో ప్రథమ స్థానం కైవసం
- ఐఐటీ, నిట్‌లలో విద్యార్థులకు సీట్లు


ప్రిన్సిపాల్‌ను, విద్యార్థులను సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: ప్రతిభకు ప్రోత్సాహం తోడైతే విద్యార్థులు చక్కని ఫలితాలను సాధించగలరు ఇందుకు నిదర్శనం అగనంపూడిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల. ఇంటర్మీడియట్ ఫలితాల్లో కొద్ది సంవత్సరాలుగా జిల్లాలో ప్రథమ శ్రేణిలో నిలుస్తూ ప్రత్యేకతను చాటుకుంటోంది. ప్రిన్సిపాల్ వి.సుశీల్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధతో, అధ్యాపకుల కృషితో ఇక్కడి విద్యార్థులు ఎన్ఐటీ, ఐఐటీల్లోనూ సీట్లు సాధిస్తున్నారు. నాలుగేళ్లలో ఐఐటీకి ముగ్గురు, నిట్‌కు ఒకరు, ఏయూలో ఇంజినీరింగ్ సీట్లు ఇద్దరు సాధించారు.

వరుసగా జిల్లాలో ప్రథమంగా.. : ఈ ఏడాది 105 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 62 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ నుంచి 39 మంది, సీఈసీ నుంచి 23 మంది మొత్తం 62 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కావడంతో, విశాఖ జిల్లా స్థాయిలో ఈ కళాశాల ప్రథమ స్థానంలో నిలిచింది. ఉమ్మడి విశాఖతో కలిపి చోడవరం తరువాత అగనంపూడి కళాశాల రెండో స్థానం దక్కించుకుంది. గతేడాది 138 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 63 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ నుంచి 39మంది, సీఈసీ నుంచి 11 మంది, ఈఈఎల్‌టీ నుంచి 13 మంది విద్యార్థులు పాసయ్యారు. 2019లోనూ కళాశాల ఫలితాల్లో జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచింది.

ఎంపీసీలో జిల్లా టాపర్

ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో డి. సాయి హర్షిణి (ఎంపీసీ) 972 మార్కులు సాధించి ప్రభుత్వ కళాశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిగా నిలిచింది. కళాశాల కమిటీ చైర్మన్ కుమార్తె బి.భావన 960 మార్కులు సాధించి, ద్వితీయ స్థానం సొంతం చేసుకుంది. మరో ఇద్దరు విద్యార్థులకు తొమ్మిది వందలకు పైగా మార్కులు వచ్చాయి.

ఆత్మీయ సత్కారం

ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో అగ్రగామిగా నిలిచిన అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను, విద్యార్థులను స్థానిక ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. సాయి హర్షిణిని అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల, స్థానికుల సహకారం, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి వెన్నంటి ఉండి ప్రోత్సహించడం వల్ల ఉత్తమ ఫలితాలను సాధించగలుగుతున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు తోకాడ రాము, అగనంపూడి హార్టికల్చరల్ సొసైటీ అధ్యక్షుడు నెల్లి శ్రీనివాసరావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కోసూరి తాతారావు, సింహాచలం, దానబాల పైడికొండ, బి.కన్నారావు, బొత్స శశికళ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి సహకారంతో సాధిస్తున్నాం



అందరి సహకారంతో మంచి ఫలితాలు సాధించగలుగుతున్నాం. విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటున్నాం. అధ్యాపకుల నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. విద్యార్థుల ఓవరాల్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించడంతో ప్రతీ ఏటా ఇంటర్, నిట్, ఐఐటీ ఫలితాల్లో ఏదో ఒక విభాగంలో కళాశాల విద్యార్థులు ఆశించిన ఫలితాలు సాధిస్తున్నారు. ఓ పక్క దాతల సహకారంతో విద్యార్థులకు కావల్సిన కనీస సౌకర్యాలు కల్పిస్తున్నాం. విద్యార్థులకు పరీక్షలు, పోటీ పరీక్షలకు కావల్సిన తర్ఫీదునిస్తున్నాం.

– వి.సుశీల్‌కుమార్, ప్రిన్సిపాల్, అగనంపూడి జూనియర్ కళాశాల

ఉత్సాహంగా ఇంటర్ స్కూల్ క్విజ్ పోటీలు

పాల్గొన్న 20 పాఠశాలల విద్యార్థులు


క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక : స్థానిక యాపిల్ ఐ స్కూల్‌లో అంతర పాఠశాలల క్విజ్ పోటీలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. 20 పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరైన ఈ పోటీలను విక్రమ సింహపురి యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆర్.సుదర్శనరావు ప్రారంభించారు. 5, 6, 7 తరగతుల విభాగంలో యాపిల్ ఐ స్కూల్, ఎన్ఎస్‌టీఎల్, డీపీఎస్ వరుస మూడు స్థానాల్లో నిలిచాయి. వారికి వరుసగా రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు నగదు బహుమతులను అందజేశారు. 8, 9, 10 తరగతుల విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన యాపిల్ ఐ స్కూల్ విద్యార్థులకు రూ.10వేలు, ద్వితీయ స్థానం పొందిన ఎన్ఎస్‌టీఎస్ విద్యార్థులకు రూ.7వేలు, తృతీయ బహుమతి పొందిన డీపాల్ స్కూల్ విద్యార్థులకు రూ.5వేలు, మిగిలిన విద్యార్థులకు రూ.2వేల కన్సొలేషన్ బహుమతిని అందజేసినట్టు పాఠశాల చైర్మన్ టి.బలరామకృష్ణ తెలిపారు.

క్లుప్తంగా

క్రికెట్ శిక్షణ ప్రారంభం


సమ్మర్ క్రికెట్ శిక్షణను ప్రారంభిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: వేసవి సెలవుల్లో విద్యార్థులు క్రీడలపై దృష్టి పెట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధి వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియంలో క్రికెట్ కోచ్ ధనాల శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, నాయకులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో 2 నుంచి వేసవి శిక్షణ శిబిరం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో మే 2వ తేదీ నుంచి వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. మే 15 వరకు నిర్వహించనున్న శిబిరంలో అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, రోలర్ స్కేటింగ్, వాలీబాల్, యోగా అంశాలపై శిక్షణ ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. ఉక్కు స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇందిరా పార్క్ స్కేటింగ్ రింక్, త్రిష్నా మైదానం, సెక్టార్-1 హాకీ ఫీల్డ్‌లలో శిక్షణ ఇస్తామన్నారు. 8 ఏళ్ల నుంచి 20 ఏళ్ల వయసు గ్రూపు కలిగిన బాలబాలికలు శిబిరానికి హాజరు కావచ్చని చెప్పారు. ఆసక్తి గల వారు ఈ నెల 30లోగా పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

ఘనంగా మౌంట్ డియోస్ స్కూల్ కల్చరల్ ఫెస్ట్


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రమాదేవి

దొండపర్తి : మౌంట్ డియోస్ ఇంటర్నేషనల్ స్కూల్ కాన్వొకేషన్, కల్చరల్ ఫెస్ట్-2023 పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ ఫెస్ట్‌కు అకడమిక్ కోఆర్డినేటర్ వరలక్ష్మి నేతృత్వం వహించగా ముఖ్య అతిథిగా స్కూల్ ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు. ముందుగా అధ్యాపకుల ఆధ్వర్యంలో బృందం ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జూనియర్ సెకండరీ విద్యార్థిని శర్వాణి నృత్య ప్రదర్శనతో అందరినీ అలరించింది. అనంతరం పాఠశాల విద్యార్థులు పలు అంశాలపై వారి ప్రతిభను ప్రదర్శించారు. సంగీతం, పాటలు, డ్యాన్స్‌లతో అందరినీ ఉర్రూతలూగించారు. చివరిగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ విద్య వందన సమర్పణ చేశారు.

పక్కి దివాకర్ కుటుంబానికి పరామర్శ


పక్కి దివాకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, కోలా గురువులు

కంచరపాలెం: ఇటీవల మరణించిన రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పక్కి దివాకర్ కుటుంబ సభ్యులను మర్రిపాలెంలోని స్వగృహంలో శుక్రవారం రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు పరామర్శించారు. దివాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి, బీసీ అధ్యయన కమిటీకి దివాకర్ చేసిన సేవలను గుర్తు చేశారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు కోటాన రాము, రామన్న పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో 'వైఎస్సార్ కంటివెలుగు'

- 60 మందికి కంటి వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రసాదరాజు

పెదగంట్యాడ: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 76వ వార్డు సచివాలయం-1లో డాక్టర్ ప్రసాదరాజు కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శిబిరంలో సుమారు 60 మంది రోగులు కంటి పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని నగరంలోని బుల్లయ్య కళాశాల సమీపంలోని ప్రాంతీయ కంటి ఆస్పత్రికి తరలించనున్నామన్నారు. అక్కడ వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. కళ్లద్దాలు అవసరమైన వారికి ఉచితంగా అందజేస్తామన్నారు. వారం రోజుల పాటు మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు.

నీటి నిల్వలతో వ్యాధుల వ్యాప్తి


కుండీలో నిల్వ నీటిని తొలగిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గాజువాక : ఇళ్లలో, నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని గాజువాక పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.ఎస్.వి.ఎన్. రాజు కోరారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా చినగంట్యాడ ఎస్సీ కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి నిల్వ వల్ల దోమలు పెరుగుతాయన్నారు. దోమలు పెరిగితే డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. ప్రతీ శుక్రవారం నీటి నిల్వలను ఇంటి పరిసరాలలో లేకుండా చేయడం వల్ల దోమల పెరుగుదలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఆరోగ్య కార్యదర్శి జె.సుశీల, ఆశ కార్యకర్త బి.సుశీల, వలంటీర్లు పాల్గొన్నారు.

బీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని వినతి


స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మిన్ సీజీఎం చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నిర్వాసితుల సంఘం, స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు కోరారు. సంఘాల నాయకులు స్టీల్ ప్లాంట్ టౌన్ అడ్మినిస్ట్రేషన్ సీజీఎం వై. చంద్రశేఖర్, సీజీఎం హెచ్‌ఆర్ జి.గాంధీలను శుక్రవారం కలిసి ఈ మేరకు వినతిపత్రాలు అందజేశారు. బీసీ గేటు నుంచి కాకతీయ జంక్షన్ వరకు గతంలో 180 అడుగుల రహదారి ఉండేదని, కాలక్రమేణా ఆక్రమణలకు గురై కుదించుకు పోయిందన్నారు. రోడ్డు గోతులమయం కావడంతో ఉద్యోగులు, కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కాంట్రాక్టు తీసుకున్న సంస్థ పనులు నిలిపివేయడం వల్ల మరింత దారుణంగా ఉందన్నారు. వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గొందేశి సత్యారావు, మంత్రి శంకర నారాయణ, వైఎస్సార్‌టీయూసీ నాయకులు మార్పుపూడి పరదేశి, గొందేశి వెంకట రమణారెడ్డి, పిట్టా రెడ్డి, ఎం.పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

806వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు


దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 806వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ దేశంలో సంపదను సృష్టించలేని కేంద్ర ప్రభుత్వానికి దేశ సంపదను అమ్మే హక్కు ఎక్కడుందని ప్రశ్నించారు. ఉక్కు ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం ఎన్ని అవరోధాలు సృష్టించినా.. చివరికి ఉక్కు పరిశ్రమ ఘనత ముందు తలదించుకోవాల్సిందేనన్నారు. సొంత గనులు లేకపోయినా ఉత్పత్తిలో పరుగులు పెట్టిన విశాఖ ఉక్కు ఘనత కేంద్రప్రభుత్వానికి ఎలా తెలుస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు కలిసి కేంద్ర ప్రభుత్వంపై గళమెత్తాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

'జగనన్నే మా ధైర్యం'


ఎస్సీ కాలనీలో స్టిక్కర్లను ప్రదర్శిస్తున్న నాయకులు, ప్రజలు

అగనంపూడి: 'జగనన్నే మా ధైర్యం, నమ్మకం, ఆధారం' అని ప్రజలు నమ్ముతున్నారని 88వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గండ్రెడ్డి కనక మహాలక్ష్మి నాయుడు, గాజువాక జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు అన్నారు. 88వ వార్డులోని కాపుజగ్గరాజుపేట సచివాలయ పరిధి ఎస్సీకాలనీలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు. పథకాల వివరాల బ్రోచర్‌ను అందజేశారు. కార్యక్రమంలో నమ్మి శ్రీనివాస్ ప్రసాద్, మాడిశ అప్పలరాజు, నత్తల భాగ్యలక్ష్మి, గుంట్ల లక్ష్మి, మచ్చ రామకృష్ణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ దృష్టికి వార్డు సమస్యలు


కమిషనర్ సాయికాంత్‌వర్మకు సమస్యలు వివరిస్తున్న 68వ వార్డు కార్పొరేటర్ అనూష


65వ వార్డులో సమస్యలు తెలియజేస్తున్న కార్పొరేటర్ నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ/అక్కిరెడ్డిపాలెం: తమ వార్డుల్లో ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 65, 68 వార్డుల కార్పొరేటర్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు శుక్రవారం వినతిపత్రాలు అందించారు. అక్కిరెడ్డిపాలెం గ్రామంలోని విశాఖ డెయిరీ కాలుష్య సమస్య, నివాసాల మధ్య పందుల సంచారం తదితర అంశాలతో పాటు డ్రైనేజీల్లో పూడికతీతకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్ దంపతులు కమిషనర్‌ను కోరారు. 65వ వార్డు పరిధిలో నీటి సమస్య, భానోజీతోటలో శిథిలావస్థకు చేరిన సామాజిక భవనం, కూడళ్లలో హైమాస్ట్ దీపాలు తదితర అంశాలను కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు.

సంక్షేమ ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌తోనే సాధ్యం


మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: సంక్షేమ ఆంధ్రప్రదేశ్ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యం అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అన్ని పదవుల్లో పెద్ద పీట వేశారన్నారు. మహిళలకు ప్రత్యేక గుర్తింపునిచ్చారని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 69వ వార్డు చుక్కవానిపాలెం నిర్వాసిత కాలనీలో శుక్రవారం సాయంత్రం ఆయన పర్యటించారు. ప్రతీ ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని గాజువాక నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అక్కడికక్కడే సంబంధిత సిబ్బందితో మాట్లాడి, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పార్టీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, విరోతి రాము, కాకి అప్పల రెడ్డి, సాలాపు వెంకటరావు, కృష్ణంరాజు, మళ్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

అక్కిరెడ్డిపాలెం: మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి సీహెచ్.చరణ్‌తేజ, 8వ తరగతి విద్యార్థిని డి.మహిమ విజేతలుగా నిలిచారు. వారికి స్థానిక యూపీహెచ్‌సీ వైద్యురాలు ప్రియాంక, అసిస్టెంట్ మలేరియా అధికారి సీహెచ్.సత్యనారాయణ, హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీహెచ్ఎస్ శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఏలు సిబ్బంది పాల్గొన్నారు.

ఔత్సాహికులకు చక్కని వేదిక

- ఎక్స్‌పోలో ఆకట్టుకుంటున్న స్టాల్స్


ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన స్టాల్స్


నూతన ఆవిష్కరణను పారిశ్రామిక వేత్తలకు వివరిస్తున్న విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని సరిపల్లి గ్రాండ్‌లో నిర్వహిస్తున్న ఇండస్ట్రియల్ కం బిజినెస్ – ఎక్స్‌పో ఔత్సాహికులకు చక్కని వేదికగా నిలిచింది. ఎక్స్‌పోలో రెండో రోజు శుక్రవారం మిల్లెట్స్, ఫుడ్ ప్రోడక్ట్స్, ఆయుర్వేద ఉత్పత్తులు, లెదర్, స్టీల్, కాయిర్ ఉత్పత్తులు, పారిశ్రామిక ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్‌తో పాటు, బ్యాంక్‌లు స్టాళ్లను ఏర్పాటు చేశారు. మూడో రోజు శనివారం ఇంటి వద్దనే చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారి కోసం పలువురు శిక్షకులతో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని ఎక్స్‌పో నిర్వాహకుడు డి.వినోద్ తెలిపారు.

విద్యార్థులకు ప్రయోజనకరం



పారిశ్రామిక ప్రాంతంలో ఇలాంటి ఎక్స్‌పోలు నిర్వహించడం వల్ల ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు స్వయం, వ్యాపార, పరిశ్రమల ఏర్పాటులో భాగంగా ఉపాధి రంగాల వైపు దృష్టి సారించే అవకాశం కల్పిస్తాయి.

– డి.వినోద్, ఫ్లోరిష్ క్రియేషన్ అధినేత

మంచి ప్లాట్‌ఫాం



ఎక్స్ పో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మంచి ప్లాట్‌ఫాం. వ్యాపార, పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి సరికొత్త ఆలోచనలకు ఆస్కారం ఏర్పడుతుంది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఇది ఎంతో ఉపయోగకరం.

– అశోక్ రాజు, అశోక ఇండస్ట్రీ, ఆటోనగర్ డీ బ్లాక్ మెంబర్

మాలాంటి వారికి మంచి అవకాశం



ఎక్స్‌పోలో విజ్ఞాన్ కళాశాల నుంచి మాకు అవకాశం లభించింది. ఇక్కడికి వచ్చిన పలువురు పారిశ్రామిక వేత్తలకు మా ఆలోచనలను ప్రయోగాత్మకంగా వివరించాం. ఇది మాకు మంచి ఎక్స్‌పీరియన్స్.

– బి.మౌనిక,వై.మోహిత్ రామ్, విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు

వ్యక్తి అదృశ్యం


సత్యనారాయణ (ఫైల్ ఫొటో)

కూర్మన్నపాలెం: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ 86వ వార్డు పరిధి సెక్టార్-1 దరి గణేష్‌నగర్‌లో సత్యనారాయణ(30) తన కుటుంబంతో నివాసముంటున్నారు. వీఎస్ఈజెడ్‌లోని ప్రైవేట్ కంపెనీలో వెల్డర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి నుంచి ఇంటర్వ్యూ అని చెప్పి వెళ్లిన సత్యనారాయణ తిరిగి రాలేదు. వెదికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి గురుమూర్తి దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సత్యనారాయణ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

దేవాడలో వివాహిత..

పెదగంట్యాడ దరి దేవాడలో నివాసముంటున్న నాగల రమణమ్మ(21) కుటుంబంతో నివాసముంటున్నారు. ఆమెకు 15 నెలల కుమార్తె కూడా ఉంది. ఈ నెల 26వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో, తల్లి కొండమ్మ దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్ఎస్‌టీఎల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

గోపాలపట్నం: జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల, కళాశాలల పరిధి 9, 10 తరగతులు, ఇంటర్, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఎన్ఎస్‌టీఎల్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధికారులు తెలిపారు. మే నెల 9, 10 తేదీల్లో ఉత్పత్తులు, మల్టీమీడియా ప్రదర్శన ఉంటుందన్నారు. ఇంటిగ్రేటెడ్ ఎప్రోచ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టయినబుల్ ఫ్యూచర్ అనే అంశంపై నమూనాల పోటీ జరుగుతుందని చెప్పారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు ప్రదర్శించనున్న నమూనాల వివరాలను ఆయా స్కూళ్లు, కాలేజీల ప్రిన్సిపాళ్లు మే 3లోగా సంస్థకు పంపించాలని సూచించారు. వివరాలకు 94902 32433, 93963 67120, 85390 88872 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఎంపికైన నమూనాలను 9, 10 తేదీల్లో జరిగే ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తామని అధికారులు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

సింహాచలం: ట్రాఫిక్ నియమాలను పాటించి సురక్షిత ప్రయాణాన్ని సాగించాలని పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ సూచించారు. పెందుర్తి లోని డీఆర్‌సీ మాల్ వద్ద వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై ఎస్ఐ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనాన్ని నడిపేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, మద్యం సేవించి వాహనాన్ని నడపడం నేరమని సూచించారు. గతంలో జరిగిన పలు ప్రమాదాలను స్క్రీన్ ద్వారా వాహనదారులకు చూపించారు.